## క్లుప్తంగా

### రగ్గులు, పండ్ల పంపిణీ



రగ్గులు, పండ్లు పంచుతున్న దృశ్యం

నరసాపురం: ఫెమీనా లయన్స్ క్లబ్ నరసాపురం శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పంజా సెంటర్ బొడమ్మ వృద్ధాశ్రమంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆశ్రమంలోని వృద్ధులకు క్లబ్ సభ్యులు చవ్వాకుల భాను, చౌదుల రమ ఆర్థిక సాయంతో రగ్గులు, పండ్లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షురాలు చెన్నా లక్ష్మి మాట్లాడుతూ తమ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు సహాయపడటం ఆనందంగా ఉందన్నారు.

### 10న నిత్యాన్నదాన గదులు ప్రారంభం

పాలకొల్లు సెంట్రల్: కర్నూలు జిల్లా శ్రీశైలంలో ఉన్న కర్ణభక్త సమాజ సంక్షేమ కమిటీ నిత్యాన్నదాన సత్రం నూతన గదులు ప్రారంభించనున్నట్లు సంఘ ప్రధాన కార్యదర్శి శాగా రాంబాబు తెలిపారు. ఆగస్టు 10న రాత్రి 3.47 గంటలకు తెల్లవారితే సోమవారం నూతన గదులు ప్రారంభించనున్నామని, కార్యక్రమానికి కర్ణభక్తులందరూ పాల్గొనాలని పేర్కొన్నారు. గదులు నిర్మాణానికి సహకరించిన దాతల ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

### వీరభద్రస్వామి ఆలయ కమిటీ ఎంపిక

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు మండలం దగ్గులూరు గ్రామంలోని పల్లపువీధి బాలవీరభద్ర వీరభద్రస్వామి ఆలయం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సోమవారం నిర్వహించిన ఆలయ కమిటీ సమావేశంలో ఆలయ స్థలదాత, గౌరవ అధ్యక్షుడు కాసా సత్యనారాయణ ఆధ్వర్యంలో కమిటీ అధ్యక్షుడిగా సప్పరపు కోటరామలింగేశ్వర పార్వతీశం, ఉపాధ్యక్షుడిగా పొన్న ప్రసాద్, సెక్రటరీగా అందే దానకోటిలింగం, ట్రెజరర్‌గా చల్లా కోటనాగబ్రహ్మమల్లేశ్వరరావు, జాయింట్ సెక్రటరీగా పెంటా వెంకట మల్లికార్జునరావులను ఎంపిక చేశారు. కార్యవర్గ సభ్యులుగా కొందరిని ఎంపిక చేశామని ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు.

### అభివృద్ధి తీర్మానాలకు ఆమోదం



సమావేశంలో సర్పంచ్ శ్యామలాసోనీ శాస్త్రి

పెనుగొండ: గతంలో ఎన్నడూ లేని విధంగా పెనుగొండలో ఎన్నో అభివృద్ధి పనులు నిర్వహించినట్టు సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి అన్నారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పెనుగొండ అభివృద్ధికి రూపొందించిన 35 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. పంచాయతీ సభ్యులతో పాటు కార్యదర్శి కె.శ్రీనివాసరెడ్డి, జి.భార్గవ్ నాయుడు, జేఎస్ రామకృష్ణ పాల్గొన్నారు.

### ప్రమాదకరంగా వంతెన మార్గం



ప్రమాదకరంగా ఉన్న వంతెన మార్గం

నరసాపురం: స్థానిక రుస్తుంబాదలో మంగళగుంటపాలెంకు వెళ్లే వంతెన మార్గం ప్రమాదకరంగా ఉంది. వంతెన ఎక్కే మార్గంలో అటు, ఇటు కూడా రాళ్లు పైకిలేచి పోయాయి. దీంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. సైకిళ్లపై వెళ్లే స్కూల్ విద్యార్థులు తరచూ జారిపడి గాయాలపాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కారించాలని వారు కోరుతున్నారు.

### బాలచందర్‌కు సత్కారం




బాలచందర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

పెనుగొండ: ప్రముఖ కవి రచయిత, అస్కా చైర్మన్ డాక్టర్ బాలచందర్ సాదేఏఉన సాభీతీ విజ్ఞాన జ్ఞాపికతో మానవత ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా పెనుగొండలో సోమవారం బాలచందర్ విలేకర్లతో మాట్లాడుతూ నల్లజర్లలో జరిగి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మానవత కార్యవర్గ సమావేశంలో వ్యవస్థాపకుడు ఎస్ రామచంద్రారెడ్డి సారధ్యంలో సత్కారించినట్లు చెప్పారు. కవిగా పలు ప్రపంచ రికార్డులు అవార్డులు, బిరుదులు సాధించినందుకు సత్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనరు గంగాధరరావు, కో ఆర్డినేటరు ఆలపాటి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు డండేపు వెంకట సూర్యనారాయణ పాల్గొన్నట్లు తెలిపారు.

# నిలువ నీడ లేక అవస్థలు

- పెనుగొండ కళాశాల కూడలి వద్ద దుస్థితి
- విద్యార్థులు, యాత్రికుల ఆవేదన



పెనుగొండ కళాశాల కూడలి వద్ద రోడ్డుపైనే కిక్కిరిసిన విద్యార్థులు

పెనుగొండ: ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల కూడలిలో నిలువ నీడ లేక ఇటు విద్యార్థులు, అటు వాసవీ మాత యాత్రికులు ఎండకు ఎండుతు, వానకు తడుస్తూ నానా అవస్థలకు గురవుతున్నారు. పెనుగొండలో ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు విద్యా సంస్థల్లో సుమారు మూడు వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో 1500లకు పైగా దూరప్రాంతాల నుంచి విద్యనభ్యసిస్తున్నారు. వీరు ఉదయం సాయంత్రం బస్సులపైనే ఆధారపడి కళాశాలకు చేరుకొంటారు. పెనుగొండ వాసవీ జన్మస్థలం కావడంతో నిత్యం వందలాది మంది మూలవిరాట్ శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయానికి, అఖిల భారత శ్రీ వాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాసవీ శాంతి థాంను దర్శించడానికి వస్తుంటారు. ముఖ్యంగా తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలి వస్తుంటారు. వీరితో కళాశాలకు రావులపాలెం, తణుకు, నరసాపురం, పెనుమంట్ర పరిసర ప్రాంతాల నుంచి విద్యార్థులు వచ్చి వెళుతుంటారు. వీరంతా ఉదయం 8 గంటల ప్రాంతంలోనూ, సాయంత్రం 5 గంటల ప్రాంతంలోనూ కూడలికి చేరుకొని బస్సుల కోసం వేచి చూస్తూంటారు.

**ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ**

పెనుగొండ కూడలిలో బస్టాండు లేక ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఎదురు చూస్తుంటారు. పెనుగొండ – మార్టేరు రహదారి విస్తరణకు ముందు కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో బస్టాండు ఉండేది. ఏడేళ్ల క్రితం విస్తరణలో బస్టాండు కూల్చేశారు. బస్టాండు నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చినా గాలికి వదలి వేశారు. వాసవీ శాంతి థాం ఆధ్వర్యంలో బస్టాండు నిర్మాణం చేపడతారని భక్తులు ఆశించినా ఆచరణలో నోచుకోలేదు. కళాశాల ఆధ్వర్యంలో చిన్నపాటి షెల్టర్ నిర్మించినా కనీసం పదిమంది ఎండకు, వానకు తలదాచుకోవడానికి నానావస్థలు పడుతున్నారు. దీంతో విద్యార్థులు, యాత్రికులు పడుతున్న అవస్థలు దారుణంగా ఉన్నాయి. అధికారులు స్పందించి కళాశాల కూడలిలో బస్టాండు నిర్మించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

### గురుకులాల్లో నేరుగా ప్రవేశాలు

నరసాపురం రూరల్: నర్సాపురం మండలం ఎల్‌బీచర్ల గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల కళాశాలల్లో 5, 10వ తరగతుల్లో విద్యార్థులకు నేరుగా ప్రవేశాలు కల్పిస్తున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో చేరాలనుకునే విద్యార్థులు కూడా నేరుగా ప్రవేశం పొందవచ్చని పేర్కొన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా డీసీఓ ఉమాదేవి ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు నేరుగా ఎల్బీచర్ల గురుకుల పాఠశాలకు వచ్చి ఖాళీగా ఉన్న సీట్లను రోస్టర్ ప్రకారం ప్రవేశం పొందవచ్చని, పూర్తి వివరాలకు సెల్ నంబర్ 99632 50626లో సంప్రదించాలని పేర్కొన్నారు.

**పెనుగొండలో స్పాట్ అడ్మిషన్లు**

పెనుగొండ: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 10వ తరగతి మిగులు సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు మంగళవారం చేయనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్ సుభాషిణి తెలిపారు. ఓసీ-01, ఎస్టీ-02, బీసీ-01, బీసీ సీ-04, ఎస్సీ-03 సీట్లు ఖాళీగా ఉన్నాయని వివరించారు. అర్హులు పూర్తి వివరాలకు సెల్ నంబర్లు 94906 13353, 85558 43214లో సంప్రదించాలని పేర్కొన్నారు.

### బార్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

నరసాపురం: నరసాపురం బార్ అసోసియేషన్ ఎన్నికలకు సోమవారం నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. ఎన్నికల అధికారి నల్లిమిల్లి జోసఫ్ అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. అధ్యక్ష పదవికి గన్నాబత్తుల వల్లభరావు, బూసి విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్ష పదవికి వైఎస్ ఫణికర్, వి.నాగేంద్రరావు, జనరల్ కార్యదర్శి పదవికి వెన్నా సూర్యప్రకాశరావు, కోశాధికారి పదవికి పూర్ల శ్రీనివాస్ నామినేషన్లు దాఖలు చేశారు. సంయుక్త సహాయ కార్యదర్శి పదవికి ఇద్దరు, కౌన్సిల్ సభ్యులకు నలుగురు నామినేషన్లు దాఖలు చేసినట్టు జోసఫ్ తెలిపారు.

### జూదరుల అరెస్ట్

నరసాపురం రూరల్: నరసాపురం మండలం నవరసపురం గ్రామం శివారు ప్రాంతంలో ఆదివారం రాత్రి పేకాట శిబిరంపై నిర్వహించిన దాడిలో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు రూరల్ ఎస్సై టి.వెంకట సురేశ్ తెలిపారు. నిందితుల నుంచి రూ.18,300, పేక ముక్కలు 52 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

### పీజీఆర్ఎస్‌కు ఫిర్యాదుల వెల్లువ



కార్యక్రమంలో ఫిర్యాదుదారుల సమస్యలు వింటున్న ఆర్డీఓ రాజు

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆర్డీఓ దాసి రాజు ఫిర్యాదులు, దరఖాస్తులను స్వీకరించారు. డివిజన్‌లోని పలు మండలాల నుంచి మొత్తం 53 ఫిర్యాదులు అందినట్టు ఆర్డీఓ తెలిపారు. ప్రజల అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి



కంచుస్తంభంపాలెం గ్రామ కమిటీ సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

యలమంచిలి: వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పనిచేసి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజా క్షేత్రంలో ఎండగట్టాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్‌బాబు పిలుపునిచ్చారు. కంచుస్తంభంపాలెం గ్రామంలో సోమవారం రాత్రి నిర్వహించిన పార్టీ గ్రామ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019లో జగనన్న అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే నవరత్నాల పథకాలను అమలు చేశారని గుర్తుచేశారు. చంద్రబాబు 13 నెలల గడచిన సూపర్ సిక్స్‌లో సగం పథకాలు కూడా కార్యరూపం దాల్చలేదని, ఐనా కూటమి నాయకులు సిగ్గు లేకుండా ఇది మంచి ప్రభుత్వమని డాంబికాలు పలుకుతూ పైశాచిన ఆనందం పొందుతున్నారని ఆరోపించారు. ప్రజలకు తాము మోసపోయామని ఇప్పటికే అర్థమైందన్నారు. అవకాశం వచ్చిన ప్రతిసారి చంద్రబాబు మోసాలను ప్రజలకు గుర్తు చేయాలని పార్టీ శ్రేణులకు స్టాలిన్‌బాబు సూచించారు. మండల కమిటీ, అనుబంధ కమిటీలు, బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యాక్రమం నిర్వహణ, పార్టీ సంస్థాగతంగా బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో పార్టీ నాయకులు ఇనుకొండ రవికుమార్, ఓదూరి భాస్కరరావు, బోనం బులివెంకన్న, కడలి ఏడుకొండలు, యాతం వెంకటేశ్వరరావు, దొమ్మేటి శ్రీనివాసు, కానూరి ప్రభాకర్, చిలకపాటి గణపతి, ఓలేటి రామదాసు, పితాని వీరన్న, చిలకపాటి శ్రీను, బొక్కా వెంకటేశ్వరరావు, యెరుబండి రాఘవులు, కొప్పాడి నాగేశ్వరరావు, కుంచే ఆంజనేయులు, పెంటపాటి నూకరాజు, మామిడిశెట్టి చినబాబు, గోనిపాటి బాబురావు, గోనెపాటి చిట్టిబాబు, గుడాల సురేష్, మల్లుల కొండ, వీరా ఉమా శంకర్, కళ్యాణం గంగాధరరావు, పోలుకొండ వెంకట్, సిర్రా నాగరాజు, పెచ్చెట్టి రాంబాబు, గుబ్బల సత్యనారాయణ, గుబ్బల వాసు, పితాని శ్రీను, కడిమి బాలు, కాండ్రేకుల బాబి తదితరులు పాల్గొన్నారు.

# నిత్యావసర సరుకుల పంపిణీ



బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందిస్తున్న జయసరిత

పాలకొల్లు సెంట్రల్: కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడం మానవధర్మమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత అన్నారు. సోమవారం స్థానిక 27వ వార్డుకు చెందిన పసుపులేటి సూర్యనారాయణ కుటుంబానికి నిత్యావసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా జయసరిత మాట్లాడుతూ సూర్యనారాయణ గత కొంత కాలంగా షుగర్ వ్యాధితో బాధపడుతున్నారని, ఇటీవల అతనికి కాలు తొలగించడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆ కుటుంబానికి తనవంతు సహకారంగా నిత్యావసర సరుకులు అందించామని చెప్పారు. ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడంలో ఉన్న సంతోషం ఎందులోను రాదని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పెచ్చెట్టి కృష్ణాజీ, జోగాడ ఉమామహేశ్వరరావు, దేవ రాజేష్, వీరా మల్లికార్జునుడు, మామిడిశెట్టి చిట్టిబాబు, రామానుజుల చిన్నమధు, రాపాక శివకుమార్, హేమలత, కుమారి, ఉప్పే పండు, బద్దా అంతర్వేది తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు పెనుగొండ విద్యార్థులు



అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన పెనుగొండ విద్యార్థులు



విద్యార్థి శ్రీనివాసును అభినందిస్తున్న హెచ్ఎం మహ్మద్ లియాకత్ ఆలీ

పెనుగొండ: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పెనుగొండ భాష్యం విద్యార్థులు ఎంపికయినట్టు ప్రిన్సిపాల్ ఎస్ వెంకటఅప్పారావు తెలిపారు. తణుకు చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ కళాశాలలో జిల్లా అథ్లెటిక్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 14, 16, 18, 20 బాలబాలికల విభాగాల్లో పెనుగొండ భాష్యం విద్యార్థులు ప్రతిభ కనబరిచారన్నారు. అండర్ 14 విభాగంలో అచంట మండలం పెనుమంచిలికి చెందిన మంగిన శివ 60 మీటర్ల రన్నింగ్ ప్రథమ, లాంగన్ జంప్ తృతీయ, బ్యాక్ త్రో షార్ట్ పుట్ ప్రథమ స్థానం సాధించగా, అండర్ 16 విభాగంలో పోడూరు మండలం పండితవిల్లూరుకు చెందిన జక్కంశెట్టి లోకేశ్వర దుర్గా ప్రసాద్ లాంగ జంప్ తృతీయ, అండర్ 14 విభాగంలో వీరమల్లు మోహిత్ రామ్ 60 మీటర్ల పరుగు పందెంలో తృతీయ, లాంగ్‌జంప్‌లో ద్వితీయ, బ్యాక్ త్ర షార్‌పుట్‌లో ద్వితీయ స్థానాలు సాధించారని తెలిపారు. వీరు ఆగష్టు 9 నుంచి 11 వరకు బాపట్ల జిల్లా చీరాలలో జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై న విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు యడవల్లి రవికుమార్, భాష్యం జోనల్ ఇన్‌చార్జి ఎ.శ్రీమన్నారాయణ రెడ్డి, చాంప్స్ ఇన్‌చార్జి రాణీ రోజాజీలు అభినందించారు.

**అథ్లెటిక్ పోటీలకు కాజ విద్యార్థి**

యలమంచిలి: కాజ తూర్పు గ్రామంలోని పింగళి వెంకయ్య జిల్లా పరిషత్ ఓరియంటల్ హైస్కూల్ విద్యార్థి చింతపల్లి శ్రీనివాసు అండర్ 14 విభాగంలో ట్రయాథలాన్ (60 మీటర్లు, 600 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్)లో రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ లియాఖత్ ఆలీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తణుకు చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ ఎంపిక పోటీలలో శ్రీనివాస్ ఉత్తమ ప్రతిభ కనపరిచాడన్నారు. ఆగస్టు 9 నుంచి 11 వరకు బాపట్ల జిల్లా చీరాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో శ్రీనివాస్ జిల్లాకు ప్రాతినిథ్యం వహిస్తాడని తెలిపారు. శ్రీనివాస్‌ను, అతనికి శిక్షణ ఇచ్చిన పీఈటీ వినాయక్‌ను హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు పీర్ సాహెబ్, మాధవి, నారాయణ ప్రసాద్ అభినందించారు.

# శ్మశానానికి స్థలం కేటాయించవద్దు



సచివాలయ కార్యదర్శి కృష్ణవర్మకి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

యలమంచిలి: బాడవలో క్రైస్తవ శ్మశానానికి స్థలం కేటాయించవద్దని గ్రామానికి చెందిన విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ కార్యకర్తలు సోమవారం బాడవ గ్రామ సచివాలయంలో గ్రామ కార్యదర్శి కృష్ణవర్మకి వినతిపత్రం ఇచ్చారు. గ్రామంలో కొందరు హిందువులు క్రైస్తవ మతం స్వీకరించి వారికి ప్రత్యేక శ్మశానం కేటాయించాలని సబ్ కలెక్టర్ కార్యాలయంలో అర్జీ ఇచ్చినట్టు తెలిసిందన్నారు. బాడవలో విశాలమైన హిందూ శ్మశాన వాటిక ఉందని, అన్ని కులాల వారు ఏకాభిప్రాయంతో శ్మశానంలో అంత్యక్రియలు నిర్వహించుకుంటున్నారని తెలిపారు. అధికారికంగా మతమార్పిడి చేసుకోకుండా హిందువులుగా చలామణి అవుతూ క్రైస్తవ శ్మశాన వాటిక కావాలనడం చట్టబద్ధం కాదన్నారు. వారికి వేరే స్థలం కేటాయించి గ్రామంలో విభేదాలు వచ్చే చర్యలు తీసుకోవద్దని కోరారు. కార్యక్రమంలో ఇనుకొండ శివ, ఇలపకుర్తి సురేష్, ఇలపకుర్తి శివ, కొండేటి బద్రి, కొండేటి మణికంఠ, ఇనుకొండ ధనరాజు, ఇనుకొండ పెద్దకాపు, రావూరి స్వామి తదితరులు ఉన్నారు.

# తల్లి పాలతో బిడ్డకు రోగ నిరోధక శక్తి



పెనుగొండ : పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం



నరసాపురం రూరల్: తల్లిపాల వారోత్సవ కార్యక్రమం

పెనుగొండ: తల్లి పాల విశిష్టతపై విస్తృత ప్రచారం చేయాలని తహసీల్దార్ జి.అనిత కుమారి అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తల్లిపాల విశిష్టత వారోత్సవాలు పోస్టర్‌ను విడుదల చేశారు. తల్లి పాలలో రోగ నిరోధక శక్తి గుణాలు అధికంగా ఉన్నాయని తెలిపారు. వ్యాక్సిన్ కన్నా తల్లి పాలలోనే ప్రభావం ఎక్కువగా ఉంటుందని వివరించారు. దీనిపై గ్రామాల్లో అంగన్‌వాడీ వర్కర్లు గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ ఎ.కృష్ణకుమారి, ఎంపీడీఓ టి.సూర్యనారాయణ మూర్తి, ఏఈ మిరియాల శ్రీనివాస్, అంగన్ వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

**బిడ్డకు మేలు**

నరసాపురం రూరల్: బిడ్డకు తల్లిపాలు ఇచ్చినంత బలం మరే పదార్థాల్లోనూ అందవని ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి అన్నారు. సోమవారం మొగల్తూరు మండల పరిషత్ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లి నుంచి మాతృ ప్రేమతో పాటు పోషకాలు, వ్యాధి నిరోధక శక్తిని అందించేవి తల్లి పాలేనని వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.విజయ్ కుమార్, కె.శ్రీదేవి తల్లిపాలపై అవగాహన కల్పించారు. తల్లిపాల వారోత్సవం పోస్టల్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చేనేత రంగాన్ని ప్రోత్సహించాలి



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ఆదరించి, చేనేత రంగాన్ని ప్రోత్సహించాలని ఇన్‌చార్జి కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన చేనేత వస్త్రాల ప్రదర్శన, అమ్మకాలను ఆయన సందర్శించారు. స్టాల్స్ నందు ఏర్పాటు చేసిన ఉప్పాడ, పట్టు చీరలు, మంగళగిరి కాటన్ చీరలు, డ్రెస్ మెటీరియల్, వివిధ రకాల చేనేత వస్త్రాల నాణ్యత, ధరల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో భాగమైన చేనేత కళను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. చేనేత వస్త్రాలు ధరించడం వలన కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆరోజు ఉదయం 9 గంటలకు పట్టణంలోని ప్రకాశం చౌక్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు చేనేత ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ అధికారి కె.అప్పారావు, స్టాల్ మేనేజర్ పి.అనిల్ కుమార్, ఆప్కో సిబ్బంది, తదితరులు ఉన్నారు.

### కొత్త గ్రీన్ ఫీల్డ్ హైవేకు త్వరలో డీపీఆర్

భీమవరం: భీమవరం – తాడేపల్లిగూడెం కొత్త గ్రీన్ ఫీల్డ్ హైవేకు త్వరలో డీపీఆర్ సిద్ధమవుతుందని కేంద్ర సహాయ మంత్రి బి.శ్రీనివాసవర్మ చెప్పారు. భీమవరంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భీమవరంలోని కుముదవల్లి రోడ్డు, బైపాస్ రోడ్డు, కాస్మో క్లబ్ రోడ్డులో ఉన్న రైల్వే క్రాసింగ్‌ల వద్ద త్వరలో ఫ్లై ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం చేస్తామని తెలిపారు. నిలిచిపోయిన ఎన్‌హెచ్ 216 నరసాపురం బైపాస్ రోడ్డు పనులకు సంబంధించి కోర్టు కేసులను రెండు నెలల్లో పరిష్కరించి నిర్మాణ పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

### కలెక్టరేట్‌లో బేబీ ఫీడింగ్ రూమ్ ఏర్పాటు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా కలెక్టరేట్ పై అంతస్తులోని వీసీ సమావేశ మందిరం పక్కన సోమవారం బేబీ ఫీడింగ్ రూమ్ (చంటి బిడ్డలకు తల్లులు పాలు ఇచ్చు గది)ని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇన్‌చార్జి కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈనెల 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాల ప్రాముఖ్యత గురించి అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులను ఆయన ఆదేశించారు.

# గృహిణికి న్యాయం చేయాలని నిరసన



గృహిణికి న్యాయం చేయాలంటూ నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): గృహిణికి న్యాయం చేయాలని కోరుతూ దళిత ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద బాధితురాలు పెనుగొండ గ్రామానికి చెందిన పడాల మీనాక్షితో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్ మాట్లాడుతూ ముసలయ్య, మీనాక్షిలకు వివాహమై 23 ఏళ్ల కాగా, గత 9 ఏళ్లుగా ముసలయ్య ఆమెను పట్టించుకోకుండా మానసికంగా వేధిస్తున్నారని, ప్రశ్నిస్తే చంపేస్తానని బెదిరిస్తున్నారని, దీనిపై పెనుగొండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. బాధితురాలికి న్యాయం చేయాలని కోరుతూ ఇన్‌చార్జి కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డికి వినతిపత్రాన్ని అందించినట్లు చెప్పారు.

### డీఎన్నార్ లా విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ

భీమవరం: పేదలకు న్యాయ సహాయం అందించడానికి కృషి చేయాలని డీఎన్నార్ కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు అన్నారు. డీఎన్నార్ లా కళాశాలలో మూడేళ్ల లా డిగ్రీ కోర్సులో ఉత్తీర్ణులైన వారికి సోమవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ ఏడాది 82 శాతం ఉత్తీర్ణత సాధించగా 14 మంది డిస్టింక్షన్, 163 మంది ప్రథమ శ్రేణి మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ కె రఘురామ్ తెలిపారు.